
నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 14 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో నీళ్లు లేక ఎండిపోయిన సాసర్‌పిట్



గూడెంలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోయిన మంచినీటి బావి

# వన్యప్రాణుల సంరక్షణపై పట్టింపేది?

## వేసవిలో నీటి సౌకర్యం కల్పించని అధికారులు

- దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్న జంతువులు
- అటవీ సమీప గ్రామాల్లోకి వస్తూ ప్రమాదాల బారిన పడుతున్న వైనం

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/పెంచికల్‌పేట్, మే 13 : వేసవిలో తాగు నీటికి వన్యప్రాణులు అల్లాడుతున్నాయి. అడవుల్లోని వాగులు.. వంకలు.. కుంటలు ఎండిపోగా, దప్పిక తీర్చుకునేందుకు సమీప గ్రామాల్లోకి వస్తూ ప్రమాదాల బారినపడుతున్నాయి. అటవీ అధికారులు వాటి సంరక్షణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల బలైపోతున్నాయి.



కుక్కల దాడికి గురైన చుక్కల దుప్పికి చికిత్స చేస్తున్న అటవీ అధికారులు(ఫైల్)

### వేటగాళ్ల ఉచ్చుకు..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల, తిర్యాణి, కెరమెరి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, సిర్పూర్-టీ, కాగజ్‌నగర్ మండలాల్లో దట్టమైన అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఆయా ప్రాంతాల్లో పులులతో పాటు జింకలు, దుప్పులు, అడవి పందులు, ఎలుగుబంట్లువంటి వన్యప్రాణులు పుష్కలంగా ఉన్నాయి. వేసవి కాలంలో అడవుల్లో ఉన్న వాగులు, కుంటల్లోని నీరు అడుగంటిపోవడంతో వాటికి తాగునీరు దొరకడం లేదు. దీంతో దాహం తీర్చుకునేందుకు పంట పొలాలు, గ్రామాల వైపు వస్తుండగా, అదునుచూసి వేటగాళ్లు వేటాడుతున్నారు. విద్యుత్ తీగలు అమర్చి నిత్యం వేటాడటం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల సిర్పూర్-టీ మండలం చీలపల్లి గ్రామ సమీపంలోకి వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు వేటాడి దాడి చేయగా, అధికారులు పట్టుకొని దానికి వైద్యమందించారు. గతంలో కొన్ని వన్యప్రాణులు బలైపోయిన ఘటనలు ఉన్నాయి.

### వన్యప్రాణుల సంరక్షణపై నిర్లక్ష్యం

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు గతంలో జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో సుమారు 29 సాసర్ పిట్స్ (తాగునీటి కుంటలు) ఏర్పాటు చేశారు. కానీ.. ప్రస్తుతం వాటిలో నీళ్లు నింపాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే అడపాదడపా నీళ్లు అందుబాటులో ఉంచుతుండగా, మరికొన్నిచోట్లను పట్టించుకోవడం లేదు. ఫలితంగా అటవీ జంతువులు దాహార్తిని తీర్చుకునేందుకు గ్రామాల సమీప ప్రాంతాల్లోకి వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఇకనైనా అటవీ అధికారులు స్పందించి వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరమున్నది.



ఎండిపోయిన నాగసముద్రం చెరువు

# పాతాళానికి గంగమ్మ!

## ఎండల తీవ్రతతో అడుగంటుతున్న భూ గర్భ జలాలు

- రెండు నెలల్లోనే 7.33 మీటర్ల లోతుకు
- ఎండిపోతున్న చెరువులు.. వ్యవసాయ బావులు
- సాగు, తాగు నీటికి తప్పని తండ్లాట

దండేపల్లి, మే 13 : ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం.. ఎండల తీవ్రతల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగు నీటికి తండ్లాడాల్సి వస్తున్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భూగర్భ జలశాఖ నివేదిక ప్రకారం భూగర్భ నీటి మట్టం 6.63 మీటర్ల లోతులో ఉండగా, కేవలం రెండు నెలల (ఏప్రిల్ వరకు) వ్యవధిలోనే 7.33 మీటర్లకు పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ యేడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే నీటి మట్టం లోతుకు పడిపోవడంతో యాసంగిలో వ్యవసాయ బావులు, బోర్ల కింద పంటలు సాగు చేసిన రైతులు సాగు నీటికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. పంటలు చేతికొచ్చే సమయంలో సాగు నీటి కొరత ఏర్పడడం వల్ల వాటిని కాపాడుకునేందుకు వ్యవసాయ బావుల్లో పూడిక తీయించి నీటి మట్టాన్ని పెంచుకునేందుకు కొందరు భగీరథ ప్రయత్నాలు చేశారు. మార్చి నుంచి ఎండలు దంచికొడుతుండగా, భూగర్భ నీటి మట్టాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుత మే నెల ప్రారంభంలోనే జిల్లాలో 45 డిగ్రీల సెల్సియస్ పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జనాలు ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

**గడిచిన మూడు నెలల్లో భూగర్భ జలాల వివరాలు**

| | | |
|---|---|---|
| జనవరి | : | 5.95 మీటర్లు |
| ఫిబ్రవరి | : | 6.63 మీటర్లు |
| మార్చి | : | 7.07 మీటర్లు |
| ఏప్రిల్ | : | 7.33 మీటర్లు |

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

మంచిర్యాల జిల్లాలో ఏప్రిల్ మాసం చివరి నాటికి జలమట్టం సగటు 7.33 ఉండగా అత్యధికంగా జైపూర్ మండలం కుందారం సమీపంలో 19.89 మీటర్ల లోతుకు పడిపోయాయి. కోటపల్లిలో 18.24 మీటర్లు, తాండూరులో 15.70 మీటర్లు, బెల్లంపెల్లిలో 15.39 మీటర్లు, మందమర్రి మండలం పొన్నారంలో 14.05 మీటర్లు, నస్పూర్‌లో 11.96 మీటర్లు, భీమినిలో 9.13 మీటర్లు, మంచిర్యాలలో 7.64 మీటర్లు, చెన్నూర్‌లో 7.62 మీటర్లు, కన్నేపల్లిలో 7.12 మీటర్లు లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మిగతా మండలాల్లో ఏడు నుంచి రెండు మీటర్ల లోతుల్లో భూగర్భ జలాలు ఉన్నాయి.

### ఎండిపోతున్న చెరువులు-వ్యవసాయ బావులు

ఎప్పుడూ లేనంతగా ఈ వేసవిలో సూర్యుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు యాసంగి సాగు పెరిగి నీటి అవసరాల వినియోగం ఎక్కువ కావడంతో జిల్లాలో భూగర్భ జలాల నీటి మట్టం క్రమక్రమంగా తగ్గుతుంది. జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో రెండు నెలల్లోనే భూగర్భ జలం మీటరు లోతు వరకు వెళ్లింది. చెరువుల్లో నీరు ఇంకిపోయి ఖాళీకావడంతో పశువులు సైతం దాహార్తికి అల్లాడుతున్నాయి. మే మొదటి వారంలోనే వేగంగా పాతాళానికి భూగర్భ జలాలు పడిపోతుండటంతో ముందుముందు తాగునీటికి సైతం ఇబ్బందులు నెలకొననున్నాయి.



గూడెంలో మంచినీటి బావికి ఏర్పాటు చేసిన మోటర్లు



దవాఖానలో విచారణ చేపడుతున్న డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్

# చెన్నూర్ సర్కారు దవాఖానలో డ్యాన్స్

## విచారణ చేపట్టిన డీసీహెచ్‌ఎస్

చెన్నూర్, మే 13 : చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం జరిగిన డ్యాన్స్ ఘటనపై డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్ మంగళవారం విచారణ చేపట్టారు. నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులు, సూపరింటెండెంట్, సిబ్బంది కలసి నృత్యం చేశారు. రోగులకు సేవలందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డ్యాన్స్ చేసిన వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పెట్టగా, అవి వైరలయ్యాయి. దీంతో ఈ ఘనటపై డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్ దవాఖానను సందర్శించి విచారణ చేపట్టారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. నర్సులు విధుల్లో ఉన్నారా? లేక వేడుకల్లో ఉన్నారా? అనే విషయాన్ని పరిశీలించారు.

# ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

సీసీసీ నస్పూర్, మే 13: ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు సాధ్యమవుతుందని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్‌లోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. మంచి ఉపాధ్యాయులు, ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని చెప్పారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పు వస్తుందన్నారు. సామర్థ్యాల పెంపు కోసం నిర్వహిస్తున్న శిక్షణను ప్రతీ ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, కోర్స్ డైరెక్టర్ రామన్న, రిసోర్స్ పర్సన్లు మహేశ్, రాజేశ్వరి, రమేశ్, రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

# ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష పేపర్లను ట్రంకు పెట్టెలో భద్రపరుస్తున్న సిబ్బంది

సీసీసీ నస్పూర్, మే 13: సీసీసీ నస్పూర్, మంచిర్యాలలో పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పాలిసెట్ ఎంట్రెన్స్ కోసం మంచిర్యాల పట్టణంలో 8, నస్పూర్‌లో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2558 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 2397 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 1292 మంది బాలురు, 1105 మంది బాలికలు ఉన్నారు. గైర్హాజరైన 161 మందిలో 74 మంది బాలురు, 87 మంది బాలికలు ఉన్నారు. ఎస్‌బీటీఈటీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలకుడు సతీశ్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, గంట ముందుగానే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్షలకు సహకరించిన శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, పోలీస్, విద్య, ఆరోగ్య, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెట్లకు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

# సీబీఎస్ఈ ఫలితాల్లో అల్ఫోర్స్ ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మే 13: సీబీఎస్ఈ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని అల్ఫోర్స్ టైనిటాన్స్ ప్రాంగణంలో విద్యార్థులను ఆయన అభినందించి, మాట్లాడారు. పదో తరగతి, 12వ తరగతి ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రకటించిన అన్ని పోటీ పరీక్షల ఫలితాల్లో అల్ఫోర్స్ ఉత్తమ స్థానంలో ఉన్నదని చెప్పారు. ఆరంభం నాటి నుంచి ఘన విజయాల పరంపరను కొనసాగిస్తూ రాష్ట్ర విద్యారంగానికి దిక్సూచిగా నిలుస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులకు మహ్మద్ షాజ్నెన్ తబాసుమ్ జాతీయ స్థాయిలో 99.4శాతంతో 497 మార్కులు సాధిండమే కాకుండా జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఎం సుచీత్‌రెడ్డి 493, జే సుప్రభ 492, ఆర్ వేదిక, టీ హర్షిణి 491, డీ హర్షిత్ 489, బీ ఆకృతి, సీహెచ్ అనీష్‌కుమార్, రయానుద్దీన్ 488, ఏ నక్షత్ర, పీ శ్రీవర్షిత, కే నక్షత్రరెడ్డి 486, ఎస్ శాలినీ, అబ్దుల్ రఫీ 484, డీ వివేక్ 483, టీ హర్షవర్ధన్, ఈ ప్రణీత్‌రెడ్డి 482, ఆర్య, కే విస్వజరెడ్డి 481, రమేసా ఫాతిమా, టీ అభిరామ్‌రెడ్డి 480 మార్కులు సాధించి ముందంజలో నిలువడమే కాకుండా జిల్లా స్థాయిలోనూ అత్యుత్తమ మార్కులను కైవసం చేసుకున్నారని ధీమా వ్యక్తం చేశారు.

### 12వ తరగతి ఫలితాల్లో..

12వ తరగతి ఫలితాల్లో వీ సంజీతరెడ్డి 96.4శాతంతో 482, ఎన్ అనిరుధ్‌సాయి 482, వీ శశాంక్‌రెడ్డి 478, జే వమీకా 473, జే వమీకా 473, వీ శశాంక్ రెడ్డి 478, ఈ మృనాలిని 473, అబ్దుల్‌హాక్ 461, టీ సాయి 461, డీ శ్రీహాన్ కౌశిక్ 460, ఎన్ మైత్రేయి 456మార్కులు సాధించి అత్యుత్తమ స్థానంలో నిలువడమే కాకుండా, జిల్లా స్థాయిలోనూ అత్యుత్తమ మార్కులు కైవసం చేసుకున్నారన్నారు. స్ఫూర్తిదాయకంగా విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక సంఖ్యలో 90 శాతం మార్కులు సాధించారని, 12వ తరగతి ఫలితాల్లో 13మంది విద్యార్థులు 90శాతం మార్కులు సాధించడం చారిత్రాత్మక విజయమని కొనియాడారు. ఘన విజయాల పరంపర కొనసాగింపునకు కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.





పదో తరగతి విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

# వడ్లు తూర్పార పడుతుండగా..

## విద్యుత్ షాక్‌తో ఇద్దరు రైతులకు గాయాలు

దహెగాం, మే13 : ప్యాడీ క్లీనర్‌లో వడ్లు తూర్పార పడుతున్న ఇద్దరు రైతులకు కరెంట్ షాక్ తగులగా, వారు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం దహెగాం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగింది. దహెగాంకు చెందిన ఎల్కరి దామోదర్, ఎల్కరి బాబాజీ నెల క్రితం ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు వడ్లు కొనుగోలు చేయకపోవడంతో నిత్యం అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ప్యాడీ క్లీనర్‌లో వడ్లు తూర్పార పడుతుండగా, అప్పటికే తెగి ఉన్న విద్యుత్ తీగ ఆ యంత్రానికి తగిలి ఉంది. వడ్లు అందులో పోస్తున్న క్రమంలో వీరిద్దరు ఆ యంత్రానికి తగలగా, షాక్ కొట్టింది. దీంతో అక్కడే పడిపోయారు. మరో రైతు వెంటనే అప్రమత్తమై కర్రతో వైర్‌ను తొలగించాడు. గాయపడ్డ రైతులను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. వడ్ల కొనుగోళ్లలో జాప్యం చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతున్న రైతులు

# ఔట్‌సోర్సింగ్ కార్మికుడికి వేధింపులు

## తీవ్ర ఒత్తిడితో కోమాలోకి వెళ్లిన సాయికిరణ్

మంచిర్యాల టౌన్, మే 13 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న పులివెందుల సాయికిరణ్‌ను తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు వేధింపులకు గురి చేయడంతో, ఆయన తీవ్ర ఒత్తిడికి గురై కోమాలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అపై అక్కడి నుంచి తీసుకెళ్లి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. సాయికిరణ్ కొన్ని రోజులుగా కమిషనర్ శివాజీ కారుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొందరు ఓర్వలేని కార్మిక సంఘాల నాయకులు అతడిపై పలు ఆరోపణలు చేస్తూ ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ సాయికిరణ్‌ను డ్రైవర్ విధుల నుంచి తప్పించారు. పారిశుధ్య ట్రాలీ డ్రైవర్‌గా నస్పూర్‌కు పంపించారు. కార్మిక సంఘం నాయకులు అక్కడికి కూడా వచ్చి సాయికిరణ్‌ను చంపుతానని బెదిరించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తన విధులకు ఆటంకం కలిగించవద్దని ఎంత చెప్పినా వారు వినకపోవడంతో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అంతకుముందు కార్మిక సంఘం నాయకులు తనను వేధిస్తున్నారంటూ మున్సిపల్ కమిషనర్‌కు సాయికిరణ్ వినతి పత్రం సైతం అందజేశాడు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్, కార్మిక సంఘం నాయకులు కోయాల వెంకటి, గణేశ్, ఆవుల రమేశ్, నవీన్, సుమన్, కోకిల శ్రీనివాస్, రాయలింగు, గోపాల్, నవీన్‌తో పాటు పలువురు తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకవాలని ఆయన కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



చికిత్స పొందుతున్న సాయి కిరణ్